# రసభంగం ★

రచన :
భమిడిపాటి రామగోపాలం

మా స్నేహితుడు ఉన్నట్లుండి నాతో చెప్పకుండా విజయవాడ వెళ్లిపోయాడు. తొలినాడు నేను వెళ్లినప్పటికి ఏ ప్రయాణపు హడావిడీలేదు; మర్నాడు వెళ్ళేటప్పటికి అతను లేడు. వాళ్లింట్లోవాళ్లు ఈశుభవార్త నాచెవిని వేశాను. ఏమీ ఊసుపోనప్పుడు మొదలుకొని అంతరంగిక విషయాల వరకూ నాతో మాట్లాడే మాస్నేహితుడు అలా, చెప్పకుండా అంతదూరం వెళ్లిపోతే నాకొ్కంచెం ఇదిగానే ఉంది మరి.

మరేముంది, ఏదో మూడునెలలవరకూ ఉత్తరాలతో కాలక్షేపంచేశాను. ఆ నెల ఎనిమిదో తారీకుకి తాను వస్తున్నట్లు వాళ్లింటికి ఉత్తరం రాశాడుట. పోయినవాడు చెప్పకుండా వెళ్లాడు బాగానే ఉందిగాని, రావడం, అందులో రాదలచుకోడం, నాతో చెప్పకుండానే-నాకు కొంచెంకోపాన్ని కలుగజేసింది.

ఎనిమిదోతారీకుని స్టేషనుకువెళ్ళి క్యూలో నిలబడి ఏమీ పోగొట్టుకోకుండానే ప్లాటుఫారం టికట్టు కొనుక్కొని రైలుఅంతా వెతికితే కనుపించకపోయేసరికి నాకు విసుగు పుట్టింది.

అనుమానంతీరక వాళ్ళింటికి వెళ్లి ఒకవేళ జట్కామీదగాని వచ్చేసేడా అని వాకబుచేస్తే వాళ్లు అతనిరాక పన్నెండోతారీకుకి మార్చబడినట్లు తెలియజేసేసరికి నాకు చాలా బాధకలిగింది.

మూడునెలలు అతనిని చూడలేకుండా ఉండగలిగిన నా మనస్సు, ఈ నాలుగురోజులలోనూ ఎంతో తొందరపడుతూ ఉండడంచూస్తే నాకు నామీదనే చికాకువేసింది.

పదకుండోతారీకుని ఏమీ ఊసుపోక, అతను రాడని తెలిసిఉండీ, వాళ్ళింటికి నడిచాను; నేనింకా మెట్లెక్కుతున్నానో లేదో వాళ్ల చిన్నచెల్లెలు ఎదురుపడి మా అన్నయ్య పార్కులోకి వెళ్ళాడని చెప్పేసరికి కల్లా సంతోషం, ఆశ్చర్యం ఒక్కమారుగా నన్ను ఆవహించాయి.

ఆ పిల్ల ఇంకా ఏదో చెపుతున్నా వినిపించుకోక పార్కువేపు చరచరా వెళ్ళిపోతున్నాను. దారిలో ఎన్నో రాళ్లుతన్నేను. నొప్పికలిగింది.

ఇక దారిఅంతా అనేక రకాలైన ఆలోచనలు పనిచేశాయి నాలో. ఎనిమిదోతారీకుకే వస్తానన్న మహానుభావుడు పన్నెండోతారీకుకి ఎందుకు పోస్టుపోన్ చెయ్యాలి? చేసినవాడు అదైనా నిలబెట్టుకోకుండా పదకొండోతారీకుకే, పుట్టి మునిగిపోయినట్టు ఎందుకు రావాలి? 'అంతా నాటు పద్ధతి!......ఏమయినా సరే ఇతనితో వెయ్యివిషయాలు మాట్లాడెయ్యాలి. మూడునెల్లు కావస్తూంది అతని మొహం చూసి. ఒక్కమారు ఈ విరహవేదనంతా వెళ్లగక్కుకోవాలి. ఈ అందోళనంతా తగ్గిపోయిం తరువాత ప్రశాంతంగా యింటికి రావాలి. అప్పుడే, బతికి వున్ననాకు మనశ్శాంతి! .........కాని పార్కులో—లాభంలేదు. అతని చుట్టూ స్నేహితులందరూ వుంటారు. వాళ్లమధ్య నా విషయాలు మాట్లాడడం ఎలాగ? చ ఛ! మాట్లాడడానికసలు వల్లకాదు! మొహంచూచి సంతోషపడవలసిందే...మాట్లాడడానికీ వుద్రేకం ఇంకెప్పుడైనా వెస్తుందా? అబ్బే, రాదు. పోని అతన్ని ఓ మూలకి తీసుకుపోయి మాట్లాడుతే?... చచ్చ అదెలా కుదురుతుంది? చుట్టూవున్నవాళ్ళు స్నేహితులాయెను. పైగా యితను నాకే ఫ్రెండా? వాళ్ళందరికీ అతనంటే మోజే. ఒక అయస్కాంతంలాగ అందరినీ ఆకర్షించుకున్నాడు. వాళ్లందర్లోంచీ అతన్ని తీసుకుపోయి, ఓ మూల—మాట్లాడాలంటే బాగుండదు. శ్రీ కృష్ణుణ్ణి, పదహారువేలమంది గోపికల్లో ఎవరో ఒకతె, కృష్ణుడు నాకే కావాలి. ఇంకెవరూ అతనిని కోరకూడదు. అంటే యేమౌతుందీ? అదే ఇక్కడా కావచ్చును...........కాగాపోగా, ఇప్పుడు—ఈ దారిలో అతను నన్ను వొంటరిగా కలుసుకుంటే?......అప్పుడు నిజంగా అన్ని విషయాలూ ఒక్క దెబ్బని వెళ్ళగక్కేద్దును.........పోనీ అప్పుడింత తొందరగా కలుసుకోకుండా, రాత్రో, రేపో కలుసుకోరాదూ? అప్పుడతను వొంటరిగా ఉంటాడు—ఈ వేదనంతా కక్కవచ్చు. పైగా ఇప్పుడు కలుసుకొని మూగగా, సమావేశాన్ని రసవిహీనం చేసే బదులు, అప్పుడు రసకందాయపు పట్టులో నడిపిస్తే బాగుంటుంది.........అబ్బే! అది మరీ లాభంలేదు. అతని మొహం చూదాం అనే తహతహ ఎక్కువైపోతూంది; ఏమాత్రం ఆలస్యానికీ మనసు ఒప్పుకోకుండా ఉంది; పైగా రాత్రిమాత్రం అతను తీరికగావుంటాడని నమ్మకం ఏమిటి? ఊళ్ళో లాజకమల్ వారి 'బన్యాసి' ఆడుతూంది! పైగా ఇవాళే వొచ్చాడు! ఎవడో ఒకడు సినిమా ప్రోగ్రాం వేసేఉంటాడు; మరి రేపు పొద్దున్న అతనికి ఏపని వుంటుందో ఏమిటో............నా కంటే అతనిమీద అంత మోజుగాని అతనికి నామీద ఆ బిగు వుందో లేదో; నేను వెళ్తే పరాయివాళ్ళని చూసినట్టు చూస్తాడేమో— అంత అలాగ కాకపోయినా ఆదరంతో చూడలేడేమో... పైగా ఈ అనుమానం, తాను వస్తున్నట్టు నాకు రాయకపోవడంవల్ల ఎక్కువై పోతోంది. తీరా వెళ్ళేసరికి నవ్వు

తూనే 'నేనొస్తానని నీ కెలాతెలిసింది?' అంటే? నియ్యోగి కూడాను. ఏమాటన్నా అనవచ్చు వ్యంగ్యంగా! అప్పుడు నాకు పరాభవంతో సిగ్గు వెయ్యొచ్చు.

కాలేజీచుట్టూ తిరిగితే మరి కొంచెం అలస్య మౌతుందని కాలేజీగ్రౌండ్సులోంచి అడ్డంగా నడుస్తూ ఆ మాటలునే ననుకునేసరికి, నాలో ఎన్ని రసాలు పుట్టేయో నేను చెప్పలేను.

ఇవతల కాంపౌండు ముఖద్వారం తెరిచివుంది గనక యథాతథంగా లోపల ప్రవేశించానుగాని, పాణిద్వారం మూసివుంది గనక సులభంగా నిర్గమించడానికి వీలులేకపోయింది. అక్కడున్న బంట్రోతును పిల్చి తీయించాను. కొంచెం ఆలస్యమైంది. నాకు ఆతురత ఎక్కువైంది.

ఎదురుగా వస్తున్న ఓ కారు, చాలా సమీపానికి వచ్చేవరకూ ఊరుకొని, ఒక్కమారు హరన్ కొట్టింది. ఆలోచనలో నేను తలవంచుకుని నడుస్తున్నానేమో, తుళ్ళిపడి తప్పుకున్నాను. ఏయిఏయి అంటూనే మీదనెక్కించే జట్కావాడి బారినుంచి జాగ్రత్తగా తప్పుకున్నాను. మెయిన్‌బజారులో న్యూసుబోయి సైకిలు పడదోసి, వాడికి కనపడకుండా ఉండేందుకు గాను గుంపులోంచి అనేక కష్టాలుపడి పార్కుకి చేరుకునే సరికి నాకు భయంతోబాటు ఆతురత కూడా కలిగింది.

మామూలుగా మేం కూర్చునేచోటులో వెతికితే అక్కడ ఎవ్వరూలేరు; తత్ఫలితంగా వాళ్లుసినిమాదగ్గిరికి బొమ్మలు చూడడానికి వెళ్ళి పోయారేమో అన్న అనుమానం నాకు కలిగేసరికి నిరాశ పొడమింది.



కొంచెం దిక్కులు చూసేసరికి మా స్నేహితుడు, మరికొందరూ, ఒక గుంపుగా కూర్చుని చూపులతో నన్ను ఆహ్వానిస్తున్నారు. మా స్నేహితుడిపక్కని కూర్చుందికి చేసిన ప్రయత్నం విఫల మవడంచూస్తే నాకు అప్పటి నిరాశ మళ్లీ కలిగింది.

శంకరనారాయణ 'ఇలారా!' అని సంజ్ఞచేసి చోటు చూపించాడు. వెళ్లి వానిపక్కని కూర్చున్నాను. పురుషోత్తం రాసిన పద్యాలుగురించి ఏదో అంటున్నాడు. ఆ గొడవలో పోయి, స్నేహితుణ్ణి కుశల ప్రశ్నాదులుకూడా చేయకపోయానని గుర్తుకొచ్చే సరికి నాకు చాలా చికాకువేసింది.

పాపం అతనికికూడా తీరుబాటు లేదు. ఎవడో ఒకడు విజయవాడ విషయాలు చెప్పమంటున్నాడు. ఆఖరుకెలాగయితేనేం, నన్ను శంకరనారాయణా, అతన్ని తదితరులూ విడిచిపెట్టాక 'ఇలారా!' అని నాకోసం చోటుచేయించాడు. అప్పటికి, నాకు వాళ్లందర్లోకీ ఏదో పెద్దస్థానం ఇవ్వబడ్డట్టు తోచి, తృప్తికలిగింది.

అయినా అప్పటికీ ఏమి మాట్లాడడానికీ నోరు రాకపోయే సరికి నాకు నామీద చాలా సిగ్గుకలిగింది.

అతను తనతో విజయవాడనుంచి తీసుకువచ్చిన అతని cousinకి వంట్లో బాగులేదని తక్కినవాళ్ల అనుజ్ఞ తీసుకుని మేం ముగ్గురంవచ్చేం ఇంటికి. అలా వస్తున్నప్పుడుచెప్పేదాం అనుకున్నాను నా సంగతిఅంతా. కాని చెప్పలేకపోయే సరికి అసంతృప్తి కలిగింది.

మొత్తానికి రసభంగం అయినట్టే.